# సలహాల్లేవ్..సమావేశాలు కరువు

- జాడలేని ఆహార సలహా సంఘాలు
- జరగని సమావేశాలు
- పట్టించుకోని పౌరసరఫాల అధికారులు
- రేషన్‌షాపులపై కొరవడిన పర్యవేక్షణ
- పెరుగుతున్న మోసాలు


బొమ్మనహాళ్ తహసీల్దార్ కార్యాలయం

**బొమ్మనహాళ్:** చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకుల అక్రమాలకు చెక్‌పెట్టి, కార్డుదారులకు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత ఆహార సలహా సంఘాలపై ఉంది. మూడు నెలలకోసారి ఆహార సలహా సంఘం ఆధ్వర్యంలో రేషన్ సరుకులపై సమీక్షించి అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే రాయదుర్గం నియోజవర్గంలో ఎక్కడ సంఘాల సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు.
రాయదుర్గం నియోజకవర్గంలో బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాలు ఉన్నాయి. మొత్తం 219 చౌక దుకాణాలు, 99,300 రేషన్ కార్డులు ఉన్నాయి. రేషన్ దుకాణాల్లో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసింది. సంఘం చైర్మన్‌గా సబ్ కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఎంపీపీ, కన్వీనర్‌గా తహసీల్దార్, సభ్యులుగా ఎంపీడీఓ, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, డీలర్ల సంఘం అధ్యక్షుడు, హాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు ఉంటారు. ఆహార సలహా కమిటీకి రేషన్ షాపుల తనిఖీలు, బియ్యం సరఫరాపై నిఘా, తూనికలు-కొలతలపై పర్యవేక్షణ అధికారాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి, సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేకపోవడంతో రేషన్ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చౌక దుకాణాల్లో ఇచ్చే సరుకుల నాణ్యతను పట్టించుకునే వారు కరువయ్యారు. రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకుల పంపిణీలో చోటు చేసుకుంటున్న సమస్యలపై పలుమార్లు లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదు. షాపుల్లో సకాలంలో సరుకులు పంపిణీ చేయలేదని, కొలతల్లో తేడాలు ఉంటున్నాయని, ఆన్‌లైన్ సక్రమంగా పనిచేయలేదని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

**వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే..**
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి నిత్యావసర సరుకులు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. రేషన్ సరుకులు సరఫరా చేసే వాహనాలను నిలిపివేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. దివ్యాంగులు, వృద్ధులు, రేషన్ దుకాణాలకు వెళ్లి క్యూలో నిల్చొని అవస్థలు పడి సరుకులు తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

| రాయదుర్గం నియెజకవర్గంలో చౌక ధాన్యపు డిపోల వివరాలు | | |
|---|---|---|
| మండలం | ఎఫ్‌పీ షాపులు | రేషన్ కార్డులు |
| బొమ్మనహాళ్ | 39 | 16,526 |
| కణేకల్లు | 47 | 19,541 |
| డి.హీరేహాళ్ | 34 | 14,482 |
| గుమ్మఘట్ట | 44 | 16,427 |
| రాయదుర్గం | 55 | 30,614 |
| మొత్తం | 219 | 99,300 |

## లోపించిన పర్యవేక్షణ



గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించేవారు. రేషన్ సరుకుల పంపిణీపై పర్యవేక్షణ ఉండేది. రేషన్ షాపుల్లో చోటు చేసుకుంటున్న లోటుపాట్లపై సమావేశాల్లో అధికారుల దృష్టికి సంఘం సభ్యులు తీసుకొచ్చేవారు. ప్రస్తుతం ఆ సంఘాలు పనిచేస్తున్నాయా? లేదా కూడా తెలియలేదు. అధికారులు పట్టించుకోలేదు.
– రమేష్, వైస్ ఎంపీపీ, కల్లుదేవనహళ్లి గ్రామం, బొమ్మనహాళ్ మండలం

## చర్యలు తీసుకుంటాం



బొమ్మనహాళ్ మండలంలో ఆహార సలహా సంఘం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రేషన్ సరుకుల పంపిణీలో ఏవైనా సమస్యలుంటే సమాచారమిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తా. ప్రతి నెలా రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి, పంపిణీ సక్రమంగా చేయాలని డీలర్లను ఆదేశిస్తున్నాం. త్వరలోనే ఆహార సలహా సంఘం ఏర్పాటు చేసి, సమావేశం నిర్వహిస్తాం. రేషన్ పంపిణీలో సమస్యలను గురించి చర్చిస్తాం.
– మునివేలు, తహసీల్దార్ బొమ్మనహాళ్ మండలం

## క్లుప్తంగా

### కులవివక్ష చూపితే చర్యలు
- ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు


ఆర్డీఓ వసంతబాబుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**కంబదూరు:** కులవివక్షత, అంటరానితనానికి దూరంగా ఉంటూ ప్రజలందరూ కలిసిమెలిసి జీవించాలని ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబులు సూచించారు. మండలంలోని కురాకులపల్లిలో దళితులకు ఆలయ ప్రవేశం, బార్బర్ షాపుల్లోకి అనుమతించకపోవడం, హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి పాటిస్తుండడంపై దళితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఆర్డీఓ వసంతబాబు,డీఎస్పీ రవిబాబు, సీఐ నీలకంఠేశ్వరలు గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై కులవివక్షత, అంటరానితనం నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలకిషన్, ఎంపీడీఓ గూడెన్న, ఎస్‌ఐ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్యం మేరకు పని కల్పించండి
**కూడేరు:** మండలానికి ఇచ్చిన టార్గెట్ మేరకు రోజుకు రెండు వేల మంది కూలీలకు పని కల్పించాలని డ్వామా ఏపీడీ విజయ కుమార్ సిబ్బందికి ఆదేశించారు. గురువారం ఆయన కూడేరులోని ఉపాధి కార్యాలయాన్ని సందర్శించి, పను ల కల్పనపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కూలీల సంఖ్య తక్కువగా ఉందని ఉపాధి పనులపై అవగాహన కల్పించి, ఎక్కువ మంది కూలీలు పనులకు వచ్చేలా చూడాలని తెలిపారు. ఏపీఓ తులసీ ప్రసాద్, ఇంజినీర్ రవి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### పేద విద్యార్థికి ఆర్థిక సాయం
**కంబదూరు:** కళాశాల ఫీజు కట్టలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థికి ఉపాధ్యాయుడు, ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ చేయూతనందించారు. కదిరిదేవరపల్లికి చెందిన పాలప్ప,కొల్లమ్మ దంపతులకు నలుగురు ఆడపిల్లలు. వీరిలో ఆఖరి కుమార్తె దుర్గేశ్వరి అనంతపురంలో బీఎస్సీ నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. పేద కుటుంబం కావడంతో కళాశాల ఫీజు కట్టలేక 5 నెలల నుంచి దుర్గేశ్వరి ఇంటి వద్దనే ఉంటోంది. ఫీజు చెల్లించలేని పరిస్థితిని తెలుసుకున్న బద్దేనాయక్.. దుర్గేశ్వరికి రూ.35వేల ఫీజును నేరుగా కళాశాల ఖాతాలో జమ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి అబ్దుల్ వహాబ్, సభ్యులు తిప్పేస్వామి, మహేష్ పాల్గొన్నారు.

### పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవం


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో జేఎన్‌టీయూ ప్రొఫెసర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

**ఉరవకొండ:** చిన్నముష్టూరు వద్దనున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవం గురువారం నిర్వహించారు. కళాశాలకు చెందిన 15 మంది ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు చెన్నైకు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దీంతో కళాశాలలో ఉద్యోగ విజయోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ అష్రాఫ్‌అలీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభకు జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్‌నాయుడు, బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈ సాలెప్ప హాజరయ్యారు. కార్యక్రమంలో వివిధ శాఖాధిపతులు సురేష్, నరసింహారెడ్డి, డాక్టర్ సులోచనలు పాల్గొన్నారు.

### 23న మాలల సింహగర్జన


పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

**ఉరవకొండ:** ఈనెల 23న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ స్కూల్ మైదానంలో జరగనున్న రాయలసీమ మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలకబాల రామాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక 4వ వార్డుని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాయలసీమ గర్జన పోస్టర్లను మాలల జేఏసీ నాయకులు విడుదల చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మొలకబాల రామాంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేసి, ఇందుకోసం నియమించిన కమిషన్ను రద్దు చేయాలన్నారు. మాలమహానాడు నాయకులు రాజు, లేపాక్షి, మోహన్, రాజ్‌కుమార్, సన్నీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి
**కూడేరు:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విభాగాల్లో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఏపీ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. కాంట్రాక్ట్ టెక్నీషియన్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కొనసాగించాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామన్నారు.

## పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి


మసీదు నిర్వాహకులు, ముతవల్లీలతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ జయానాయక్

**రాయదుర్గంటౌన్:** శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని అర్బన్ సీఐ జయానాయక్ ముస్లిం మత పెద్దలకు సూచించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మసీదుల ముతవల్లీలు, పెద్దలతో పీస్ మీటింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ శుక్రవారం హోలీ పండుగతో పాటు ముస్లింలకు రంజాన్ మాసం శుక్రవారం కూడా ఒకే సారి వస్తున్నందున శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. జుమా నమాజ్ తరువాత అనవసరంగా బయట తిరగరాదన్నారు. మసీదుల ముతవల్లీలు, ప్రభుత్వ ఖాజీ సైపుల్లా, మున్సిపల్ వైస్ చైర్మన్ వలిబాషు, కౌన్సిలర్ ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

**హోలీ, రంజాన్ ఫ్రైడే ప్రశాంతంగా జరుపుకోండి**
**కణేకల్లు:** హోలీ, రంజాన్ ఫ్రై డే ప్రత్యేక నమాజ్‌లను హిందూ-ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ నాగమధు తెలిపారు. రంజాన్ మాసంలో ఫ్రైడేకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ఇదే సమయంలో హోలీ పండుగ కూడా రావడంతో హిందూ-ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి


బెళుగుప్ప: మాట్లాడుతున్న ఏఫ్ ఎకాలజీ ఎల్‌పీ కోఆర్డినేటర్ రిజ్వానా


కూడేరు: మాట్లాడుతున్న రూరల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి

**బెళుగుప్ప:** మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎకాలజీ విభాగం ఎల్‌పీ కోఆర్డినేటర్ రిజ్వానా, పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రియాంక, కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వెంకటాద్రిపల్లి ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఎఫ్ ఎకాలజీ సంస్థ ప్రతినిధులు ఎంఎస్ గ్రూపుల సభ్యులు కలసి ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.అనంతరం ర్యాలీ చేశారు. అనంతరం ఎకాలజీ సెంటర్‌లో ఎఫ్‌పీఓ రామాంజనమ్మ అధ్యక్షతన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఎఫ్ ఎకాలజీ ఏరియా మేనేజర్ రమేష్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శాలిని, ఎంటీఎల్ బవాని, సీఈఓ హరీష్,సస్యమిత్ర కోకన్వీనర్‌లు శిరీష, లాలెమ్మ, రైతు సమాఖ్య కమిటీ సభ్యులు సంజీవరెడ్డి, సస్యమిత్ర గ్రూపు మెంబర్లు పాల్గొన్నారు.

**మహిళలు తల్చుకుంటే సాధించలేనిదిలేదు**
**కూడేరు:** మహిళలు తల్చుకుంటే సాధించలేనిదేదీ ఏదీలేదని, ఆత్మస్థైర్యంతో ఎదగాలని ఆర్డీటీ రూరల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఎస్‌ఏడీఎల్ కోఆర్డినేటర్ రుద్రయ్య పిలుపునిచ్చారు. గురువారం కూడేరులో ఆర్డీటీ సస్యమిత్ర సమాఖ్య రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో ఎంటీఎల్ శివమ్మ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. తొలుత ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీస్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ మానవహారంగా నిర్వహించారు. తర్వాత ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీస్ వద్ద మహిళలకు మ్యూజికల్ చైర్, ఇతర ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణారెడ్డి, రుద్రయ్యలు మాట్లాడారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీజీబీ మేనేజర్ రవికుమార్, ఎంటీఎల్ శివమ్మ, ఎస్టీఓలు వనిజ, అనిత, బ్రహ్మయ్య, అరుణకుమారి, మల్లికార్జున, షమీర్, నారాయణ స్వామి, మహిళలు పాల్గొన్నారు.

## పోలీసులకు సొల్లాపురం గ్రామస్తుల సన్మానం



ఎస్‌ఐ నాగమధుతోపాటు సిబ్బందిని సన్మానిస్తున్న గ్రామస్తులు

**కణేకల్లు:** మండలంలోని సొల్లాపురం గ్రామస్తులు ఎస్‌ఐ నాగమధు,హెడ్ కానిస్టేబుల్ లింగమయ్య, చంద్రమోహన్, కానిస్టేబుల్ సూర్యనారాయణ, సురేష్, రామాంజనేయులు, గోపిని గురువారం సన్మానించారు. గ్రామంలోని సీతారామాలయ సొమ్ము రూ.12 లక్షలు దొంగలించిన దుండగులను పట్టుకునేందుకు చొరవ చూపిన ఎస్‌ఐ నాగమధును గ్రామస్తులు అభినందించారు. గురువారం కణేకల్లు పోలీసు స్టేషన్‌కొచ్చి ఎస్‌ఐతో పాటు, సిబ్బందిని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గుర్రం లక్ష్మణ్ణచౌదరి, భాస్కర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి , గుర్రం నారాయణస్వామి, వై.శేషప్పచౌదరి, జగన్నాథరెడ్డి, వై.వేణు. ఉద్దేహాళ్ బాబు, డి.సోమలింగారెడ్డి, కె.విశ్వనాథరెడ్డి, కె.శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**కళ్యాణదుర్గం రూరల్:** విద్యా రంగ సమస్యలు పోరాటాలతోనే పరిష్కారమవుతాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం పిల్లలకు కాకుండా ఏజెన్సీ వారికి భోజన పథకం మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అనంతరం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా నవదీప్, ధనుష్, పట్టణ ఉపాధ్యక్షులుగా శీను, విజయ్, సహాయ కార్యదర్శులుగా రేవంత్ విజయ్ ఎన్నుకున్నారు.

**విద్యారంగ సమస్యల పరిష్కారానికి దీక్ష**
**ఉరవకొండ:** కూటమి ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న విజయవాడలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన దీక్ష చేపట్టినట్లు నాయకులు తెలిపారు. గురువారం స్థానిక ఎస్కే ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి, తరుణ్, భాస్కర్, వంశా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శివరామిరెడ్డి మాతృమూర్తి లలితమ్మకు నివాళి


లలితమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శివరామిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు

**వజ్రకరూరు:** మండలంలోని కొనకొండ్లలో ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి తల్లి వై.లలితమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. లలితమ్మ సమాధి వద్ద ఆమె కుమారులు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి, గుంతకల్లు, ఆదోని మాజీ ఎమ్మెల్యేలు వై.వెంట్రామిరెడ్డి, వై.సాయి ప్రసా ద్ రెడ్డి, టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి, కుమార్తె వరలక్ష్మి, మనుమళ్లు వై.భీమిరెడ్డి, వై.ప్రదీప్‌రెడ్డి, వై.జయమనోజ్‌రెడ్డి, వై.కపిల్‌రెడ్డి, ధరణిరెడ్డి, మనుమరాళ్లు వై.నైరుతీరెడ్డి,వై.కీర్తిరెడ్డి, వై.నవ్యతారెడ్డి, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వై.సాయిప్రసాద్‌రెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, మనుమడు వై.భీమిరెడ్డి తదితరులు అన్నదానం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి తదితరులు లలితమ్మకు నివాళులర్పించారు. స్థానికులతోపాటు ఉరవకొండ, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాలతోపాటు ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కర్ణాటక, తెలంగాణా ప్రాంతాల నుంచి వేలాదిగా అభిమానులు, ప్రజాప్రతినిధులు , వైఎస్సార్‌సీపీ నాయకులు తరలివచ్చారు.

## సంక్షిప్త సమాచారం

**ఇష్టంతో చదవితేనే మంచి ఫలితాలు**
**వజ్రకరూరు:** విద్యార్థులు ఇష్టంతో చదివితేనే మంచి ఫలితాలు సాధించొచ్చని సర్పంచు మోనాలిసా తెలిపారు. గురువారం స్థానిక బీసీ బాలుర వసతి గృహాన్ని సర్పంచు సందర్శించారు. టెన్త్ విద్యార్థులతో సర్పంచు మాట్లాడారు. పరీక్షలు దగ్గర ప డటంతో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చక్కగా చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**పీ–4 సర్వే వేగవంతం చేయాలి**
**బొమ్మనహాళ్:** గ్రామాల్లో జరుగుతున్న పీ-4 సర్వే పక్కాగా నమోదు చేస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం మండలంలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఉద్దేహాళ్ గ్రామ సచివాలయంలో సిబ్బందితో మాట్లాడారు. నిర్లక్ష్యం చేయకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇచ్చిన వ్యవధిలోనే పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్‌డీ దాస్, కార్యదర్శి శివన్న, వీఆర్వో యుగంధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**బాలికల భవిష్యత్‌ను నాశనం చేయొద్దు**
**కూడేరు:** బాల్య వివాహాలు చేసి వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేయొద్దని నియోజక వర్గ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ బాలికల తల్లిదండ్రులకు సూచించారు. గురువారం కూడేరులోని హైస్కూల్‌లో టీనేజ్ ప్రెగ్నెన్సీ.. బాల్య వివాహాలుతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ మాట్లాడారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, ఏఎన్ఎంలు సుశీల, చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు కళావతి, నాగలక్ష్మీ, కుమారి, నిర్మల, ఆశా వర్కర్లు మాధవి, సుమలత, వన్నూరమ్మ పాల్గొన్నారు.

**సాయిబాబాకు వెండి ఊయల బహూకరణ**
**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో వాల్మీకి సంక్షేమ సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బండి కిష్టప్ప, ఆలయ గౌరవాధ్యక్షుడు బండి కిష్టప్ప, సతీమణి సరస్వతీ వెండి ఊయలను గురువారం బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్ఎల్‌వీ రాధాకృష్ణ, కోశాధికారి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధి పనుల పరిశీలన**


శెట్టూరు ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న పీడీ సలీంబాషా

**శెట్టూరు:** మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పీడీ సలీం బాషా పరిశీలించారు. గురువారం శెట్టూరు, యాటకల్లు, బసంపల్లి గ్రామాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ నీరజ, ఈసీ వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

**మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తాం**
**గుమ్మఘట్ట:** మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండలంలోని బీసీ,ఈబీసీ,కమ్మ,రెడ్డి,క్షత్రియ,వైశ్య, బ్రహ్మణ,కాపు (బలిజ)కులాల మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా కుట్టుశిక్షణ, మిషన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.

**తిమ్మసముద్రంలో నవోదయం**
**కళ్యాణదుర్గం రూరల్:** తిమ్మసముద్రం గ్రామంలో గురువారం నవోదయం 2.0 అనే కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, సరఫరా చేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కుళ్లాయప్ప, ఎక్సైజ్ ఎస్‌ఐ ఆంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ తిరుపాల్‌నాయక్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

**వైభవంగా భంభంస్వామి దీపారాధన**
**రాయదుర్గంటౌన్:** పట్టణంలో వెలసిన శ్రీమహాయోగి భం షేక్ అబ్దుల్ వాహాబ్‌స్వాముల ఉరుసు ఘనంగా జరుగుతోంది. గురువారం సాయంత్రం దర్గాలో చిరాఖేన్ (దీపారాధన) నిర్వహించారు. సాయంత్రం స్వామి జీవసమాధికి ప్రత్యేక పూజలు, ఫాతెహ నిర్వహించారు. అనంతరం భంషేక్ అబ్దుల్ స్వాముల వారి చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంపై పట్టణ వీధుల్లో ఊరేగించారు. కణేకల్లు రోడ్డు, లక్ష్మీబజార్, పాతబస్టాండ్, బళ్లారి రోడ్డు, వినాయక సర్కిల్, లక్ష్మీబజార్ మీదుగా ఆశ్రమం వరకు ఊరేగింపు సాగింది.

**చలివేంద్రం ప్రారంభం**


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గవిమఠం ఉత్తరాధికారి, సీఐ, ఎస్‌ఐలు

**ఉరవకొండ:** స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ఎదురుగా జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు, రజని దంపతులు కొడుకు నాగమల్లి అక్రాంత్, కుమార్తె మనస్వి జన్మదినాన్ని పురస్కరించుకొని ఉచిత చలివేంద్రం ఏర్పాటు చేశారు. అర్బన్ సీఐ మహానంది, ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు, పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్‌లు హాజరయ్యారు. వీరశైవ సంఘం నాయకులు నిరంజన్ గౌడ్, లయన్స్ క్లబ్ సభ్యులు గణేష్‌బాబు, నాగేశ్వరావు, సత్తెన్న, ఈశ్వరీ బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ నెల మార్చి 17 నుంచి మే 22 వరకు https://apms.apcfss.in,www.cse.ap.gov.in ఆన్‌లైన్ వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి ఇప్పటి దాకా ఆన్‌లైన్‌లో 222 దరఖాస్తులు అందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోండి

**బొమ్మనహాళ్:** ఉంతకల్లులోని 38వ షాప్ నంబర్ రేషన్ డీలర్‌పై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. దాదాపు 420 మంది రేషన్ కార్డులకు రేషన్ పంపిణీ చేయాల్సి ఉండగా, కేవలం 150 మంది ఇచ్చేంత రేషన్ మాత్రమే షాపులో ఉందని, మిగతా బియ్యాన్ని పక్కదారి పట్టించారని ఆరోపించారు. 70 బస్తాలు బయట వ్యక్తులకు అమ్మేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తహసీల్దార్ మునివేలు దృష్టికి సమస్యను తీసుకెళ్లగా రేషన్ షాపును పరిశీలించి సక్రమంగా లబ్ధిదారులకు బియ్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## లైంగిక దాడులు చేస్తే చర్యలు
- ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి

**ఉరవకొండ:** అభం, శుభం తెలియని చిన్నారుల లైంగిక దాడులకు పాల్పడితే కఠిన చట్టాలు అమలులో ఉన్నాయని ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి మాట్లాడుతూ లైంగిక నేరాల నుంచి పిల్లలను రక్షించేందుకు భారత ప్రభుత్వం తీసుకొచ్చిన ఈచట్టం ద్వారా ఫోక్సో కేసు నమోదు చేసి నేరస్తులపై కఠిన శిక్షలు అమలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జనార్దన్ నాయుడు, సీడీపీఓ శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

## సామూహిక ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులోని మక్కా మసీదులో గురువారం సాయంత్రం సామూహిక ఇఫ్తార్ విందు జరిగింది. కాలనీకి చెందిన కొందరు ముస్లిం యువకుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించి మగ్‌రిబ్ నమాజ్ అనంతరం ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు ఘన సన్మానం


తహసీల్దార్‌కు సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న సిబ్బంది

**కణేకల్లు:** కణేకల్లు తహసీల్దార్ ఫణికుమార్‌కు గురువారం సిబ్బంది సన్మానం చేశారు. తహసీల్దార్ ఫణికుమార్ విజయవాడలోని సీసీఎల్ఏకు బదిలీ కావడంతో ఆయన గురువారం రిలీవ్ అయ్యారు. డీటీ విశ్వనాథ్, ఆర్ఐ విజయకుమార్ తోపాటు సిబ్బంది, వీఆర్వోలు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, సబ్ ట్రెజరీ సీనియర్ అసిస్టెంట్ చల్లా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.